

భరత్‌నగర్ యువసేన గ్రౌండ్‌లో భూమికి సమాంతరంగా ఇంకుడు గుంత



శివసేన గ్రౌండ్‌లో కనుమరుగైన ఇంకుడు గుంత

ఇంకుడు గుంతలు.. పట్టించుకోరెందుకు?

అవగాహన ర్యాలీల్లో భేష్.. విధి నిర్వహణలో తుస్.!

- నిర్వహణపై దృష్టి పెట్టని సంబంధిత అధికారులు
- కనుమరుగవుతున్న ఇంకుడు గుంతులు
- ఓ ప్రాంతంలో గుంతను మూసేసి ఇసుక అమ్మకాలు
- వర్షాకాలానికి ముందే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

మూసాపేట: వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని అవగాహన కల్పించాల్సిన అధికారులే ఆ విషయాన్ని మరిచారు. ప్రస్తుత ఎండాకాలంలో బోర్లు అడుగంటి పోయి నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. 1500 అడుగులు వరకు ఉన్న బోర్లు కూడా ఈ వేసవి కాలంలో పూర్తిగా ఎండిపోయి ట్యాంకర్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. రానున్న కాలంలో ఈ సమస్య మరింత జఠిలం కానున్నది. కాలనీలలోని కూడళ్లు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని రానున్న వర్షాకాలంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి సంవత్సరం అవగాహన కల్పించాల్సిన అధికారులే తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి ప్రజలు నీటి ట్యాంకర్ల కోసం వారాల తరబడి ఎదురు చూస్తున్నారు. అపార్టుమెంట్ వాసులు సైతం బిందెలు పట్టుకొని రోడ్లపై వేచి చూడాల్సిన పరిస్థితి కలుగుతోంది.

వాటర్ ట్యాంక్ ఉన్నా తప్పని నీటి తిప్పలు..

కాలనీలలోనే అతి పెద్ద వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికి రెండురోజులకు ఒకసారి వచ్చే నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అది కూడా లో ప్రెజర్‌తో అరగంట సేపే రావటంతో నీటి సమస్య మరింత తీవ్రతరమవుతోంది. బోర్లు పూర్తిగా ఎండిపోవటంతో ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారు. కాలనీలోనే ట్యాంక్ వద్ద ట్యాంకర్లు నిండి వేరే కాలనీలలోకి వెళుతున్నా తాము బుక్ చేసినా కూడా వారాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్య అధికంగా ఉన్న సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదు.

ర్యాలీలు తప్ప చర్యలు లేవు..

గతంలో కాలనీలోని పలు గ్రౌండ్స్‌లో కూడళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశామని ఆర్భాటం చేసే వాటర్ వర్క్స్ అధికారులు ఈ ఏడాది ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. కనీసం గతంలో తీసిన ఇంకుడు గుంతలకు మరమ్మతులు కూడా చేయలేదు. పలు చోట్ల ఇంకుడు గుంతలు కనుమరుగైపోయాయి. అప్పుడప్పుడు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

మరిన్ని ఇంకుడు గుంతలను నిర్మించాలి

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని చెప్పాల్సిన అధికారులు కనీసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయకపోవటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిని ఇంకుడు గుంతలను కూడా పట్టించుకోకపోవటంతో ప్రజలు అభ్యంతరం చెబుతున్నారు. ఇంకుడు గుంతల ప్రాంతంలో ఇసుక, ఇటుక అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోకపోవటంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీలు, పార్కులు, కూడళ్ల వద్ద మరిన్ని ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తాం

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కేపీహెచ్‌బీ కాలనీ నుంచి కొత్త వాటర్ ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నాం. భరత్‌నగర్‌కాలనీలో ఇంకా ప్రారంభించలేదు. కేపీహెచ్‌బీకాలనీ నుంచి ఇంకుడు గుంతల పనులు మొదలు పెట్టారు. స్నేహపురి కాలనీలో రెండు ఇంకుడు గుంతలకు మరమ్మతులు చేశాం. భరత్‌నగర్‌కాలనీలో ఉన్న వాటికి త్వరలో మరమ్మతులు చేస్తాం.

– విలియం ప్రకాష్, వాటర్‌వర్క్స్ మేనేజర్



పోచమ్మ గ్రౌండ్‌లో భవన నిర్మాణ వ్యర్థాల్లో కలిసిపోయిన ఇంకుడు గుంత

మచ్చుకు కొన్ని.. నిర్వహణ లేమి.!

- నిర్వహణ లేక భరత్‌నగర్ కాలనీలోని యువసేన గ్రౌండ్‌లో ఇంకుడు గుంత భూమికి సమాంతరంగా అయ్యింది.
- శివసేన గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత స్థానంలో చెత్తాచెదారం పడేయడంతో ఇంకుడు గుంత కనుమరుగైపోయింది.
- పోచమ్మ గ్రౌండ్‌లో ఉన్న మరో ఇంకుడు గుంత భవన నిర్మాణ వ్యర్థాలతో కలిసి పోయింది.
- మరో పార్కు ముందు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతపై ఇసుక, ఇటుకలను పోసి అమ్ముతున్నారు.



భరత్ నగర్ పార్కువద్ద ఇంకుడు గుంతపై ఇసుక వ్యాపారం

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి



విజయనగర్, నవోదయకాలనీల్లో నెలకొన్న ట్రాఫిక్‌ను పరిశీలించిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కాలనీవాసులతో కలిసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రచించాలన్నారు. కాలనీలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరం ఉన్న చోట డివైడర్లు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు మళ్లింపుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

- రోడ్డు దాటే ప్రాంతంలో బోర్డులు పెట్టాలన్నారు. ఉదయం, సాయంత్ర వేలల్లో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. అందరి సహకారంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపెట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు కాశీనాథ్‌యాదవ్, సత్యనారాయణ, నవీన్, స్వరూప, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

మోతీనగర్: కబీర్‌నగర్‌లోని శివరామాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలోని అన్ని ఉపదేవాలయాల్లో అభిషేకం, ఉత్సవ ప్రారంభం, గణపతి పూజ, రక్షా బంధనం, అంకురార్పణ నిర్వహించారు. ఈ వేడుకలు జూన్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



శ్రీలలిత హోమం పాల్గొన్న భక్తులు

మోతీనగర్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని శ్రీశృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ కార్యనిర్వహణ అధికారి సీఎస్ ఆర్ మూర్తి పేర్కొన్నారు. శృంగేరి శారదా పీఠం మోతీనగర్ శాఖ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం శారదాంబను శ్రీలలితమాత రూపంలో అలంకరించారు. శ్రీలలితా హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

ఆల్విన్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు విద్యకల్పన, ఏకాంత్‌గౌడ్‌లు బుధవారం నయా ఫౌండేషన్‌కు నిత్యావసరాలను అందజేశారు. అనంతరం చిన్నారులతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నయాశ్రీ ఫౌండర్ అనిల్, షాలిని, నాగమణి తదితరులు ఉన్నారు.

తాగునీరు, మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న నిర్వాహకులు

బాలానగర్: సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ముందుకు సాగుతోంది. 2017 సంవత్సరం నుంచి ప్రతి వేసవిలో తాగునీరు, మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పంపిణీ చేస్తున్నారు. దాతల సహకారంతోనే ఇన్ని సంవత్సరాలుగా నిరాటంకంగా ప్రజలకు సేవలు అందజేస్తున్నామని అధ్యక్షుడు కల్లూరి ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓబుల్ రెడ్డి, వెంకటరెడ్డి అన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

రాయదుర్గం: ఖాజాగూడ పెద్ద చెరువు పరిధిలో నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ పెద్ద చెరువు పరిసరాల్లో ప్రహరీగోడ నిర్మించగా జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్, డిమాలిషన్ విభాగం నోడల్ ఆఫీసర్ స్నేహా శబరీష్ ఆదేశంపై అధికారులు జేసీబీతో ప్రహరీగోడను కూల్చివేశారు. అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

వినూత్న కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ శ్రీకారం

జీవీపీలో బర్త్ డే చేసుకునే వారికి కేక్ ఉచితం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చెత్త వేసే ప్రాంతాల్లో 'చాయ్‌పే చర్చ, చెస్'వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జీవీపీ (గార్బేజ్ వర్నలబుల్ పాయింట్)లలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. జీవీపీలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకునే వారికి ఉచితంగా కేక్ అందజేస్తామని తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జోన్ పరిధిలో నాలాల వద్ద ప్రమాదకర పరిస్థితులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జెడ్‌సీ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో జరిగిన 5 సర్కిళ్ల ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, నాలాల వద్ద ముంపు సమస్యలపై హెచ్చరిక బోర్డులు, నాలాలకు కంచె ఏర్పాటు పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి పెట్టండి

జల సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

సనత్‌నగర్: భావితరాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ జల సత్యనారాయణ సూచించారు. జలమండలి ఎండీ సూచనల మేరకు బుధవారం జెక్‌కాలనీ గాంధీపార్కులో వాటర్ హార్వేస్టింగ్‌పై కాలనీ నివాసితులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా నీరు భూమిలో ఇంకే పరిస్థితి తగ్గిపోతుందని, తద్వారా వరదనీరు వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ల నివాసితులు తమకున్న స్థలంలోనే ఇంకుడుగుంతలను నిర్మించుకోవాలని సూచించారు.

- అలాగే ఇప్పటికే ఉన్న ఇంకుడుగుంతలను ఏ విధంగా పునరుద్ధరించుకోవాలో వివరించారు. బోర్లు ఎండిపోయి ఉన్న పక్షంలో చుట్టూ ఇంకుడు గుంతలను నిర్మించుకుని వరదనీటిని తరలించే చర్యలు చేపట్టాల్సిందిగా సూచించారు. తద్వారా బోర్లకు పునరుజ్జీవనం లభిస్తుందన్నారు. ఇంకుడుగుంతల నిర్మాణంలో అనుసరించాల్సిన సాంకేతిక పద్ధతులను ఆయన వివరించారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి డిజైన్ చేసుకుని ఇంకుడుగుంతను నిర్మించుకోవడం ద్వారా వరదనీటిని ఒడిసి పట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెక్ కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌చందు పాల్గొన్నారు.

తెలంగాణ సాహితీ వైతాళికుడు సురవరం

చిక్కడపల్లి: తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వానికి సురవరం ప్రతాపరెడ్డి విశేష సేవ చేశారని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది మహనీయులు యాదిలో భాగంగా తెలంగాణ సాహితీ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు మాట్లాడుతూ న్యాయవాదిగా, సామాజిక వేత్తగా, సంపాదకునిగా, తెలంగాణ రైతాంగ సాయిధ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన ఉద్యమ కారునిగా ప్రతాపరెడ్డి చరిత్రను పాఠ్య పుస్తకంలో చేర్చాలని కోరారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి మాట్లాడుతూ గోల్కొండ పత్రిక సంపాదకుడిగా తెలంగాణ కవులు, సాహితీవేత్తలను వెలుగులోకి తెచ్చిన సురవరం ప్రతాపరెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కూడా గుర్తింపు పొందారని, ఆయన జీవితం నేటి రాజకీయ వేత్తలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ మూర్తి, భవాని, శ్రీమణి పాల్గొన్నారు.

1969 తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాల్‌రావు



కాచిగూడ: 1969లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి జైలు జీవితం గడిపిన విద్యార్థి ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్. గోపాల్‌రావు అన్నారు. అప్పటి ఉద్యమకారులు వయస్సు పై బడి ఆర్థికంగా, ఆరోగ్య పరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం కాచిగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సం సందర్భంగా ఉద్యమకారులను ప్రభుత్వం సత్కరించనున్నట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. జైలు జీవితం అనుభవించిన ఉద్యమకారుల వివరాలతో కూడిన జాబితాను ఇప్పటికే ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలకు అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇప్పటికైనా వారిని గుర్తించి ఉద్యమకారులకు ఇళ్ల స్థలం, పింఛన్, ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. 1969 ఉద్యమనేతల్లో ఇప్పటికే ఎంతో మంది చనిపోయారని, మిగిలిన వారిలో 45 మందితో కూడిన ఉద్యమకారుల లిస్టును సీఎంకు అందజేయనున్నట్లు తెలిపారు. అప్పటి ఉద్యమకారుల పేరుతో కొన్ని నకిలీ సంఘాలు పుట్టుకు వస్తున్నాయని అలాంటి వారి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం 72 ఏళ్ల లోపు ఉన్నవారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, 72 ఏళ్ల పైబడి ఉన్నవారిని మాత్రమే ఉద్యమకారులుగా గుర్తించాలని కోరారు.

మౌంట్ ఎవరెస్టు అధిరోహించిన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి



హఫీజ్‌పేట్: ఆసియా ఖండంలోనే ఎత్తైన ఎవరెస్టు (మౌంట్ ఎవరెస్టు)ను హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్‌లో నివాసముండే ఆర్థోపెడిక్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అధిరోహించారు. మే 23న మౌంట్ ఎవరెస్టును అధిరోహించిన ఆయన బుధవారం నగరానికి చేరుకోగా తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం పలికారు. రాజశేఖర్‌రెడ్డి దేశంలోనే మూడవ డాక్టర్‌గా, దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి మౌంటేనర్‌గా నిలిచాడు. ఒకవైపు వైద్యసేవలందిస్తూ మరోవైపు మౌంటేనర్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

కథనానికి స్పందించి.. మరమ్మతులు చేసి!

'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ వివేకానంద నగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలో తాగునీటి పైపులైన్‌ల వాల్వ్‌లు లీకేజీ ఏర్పడింది. తాగునీరు వృథాగా పోవడంతో పాటు కలుషిత జలాలు సరఫరా అయ్యేవి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఈనెల 28న 'తాగునీరు వృథాగా పోతూ... మురుగు రోడ్లపై పారుతూ'అనే శీర్షికతో 'సాక్షి'లో వార్తా కథనం వచ్చింది. దీనికి స్పందించిన అధికారులు బుధవారం వాల్వ్‌లో వాషర్లు వేసి సరిచేశారు. కలుషిత జలాలు సరఫరా కాకుండా చర్యలు చేపట్టారు. దీంతో 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



రిక్షాపుల్లర్స్ కాలనీలో లీకవుతున్న తాగునీరు (ఫైల్)



లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ప్లాంట్ జెనెటిక్, ఏజీ వర్సిటీ ఎంఓయూ

ఏజీవర్సిటీ: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య బుధవారం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాలలో ప్లాంట్ జెనెటిక్ వనరుల వినియోగం ప్రధాన లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది.అలాగే పరిశోధన, విద్యా కార్యక్రమాలలోను ఇరు సంస్థలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి.దీనివల్ల పీజీ ,పీజెడ్ విద్యార్థులకు పరిశోధనలో ఎంతో ఉపయోగం ఉంటుంది. దీంతో పాటు ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి పరిశోధనలు చేయడానికి ఇది చాల దోహదం చేయనుంది.రాజేంద్రనగర్‌లోని ఎన్‌బీపీజీఆర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్లాంట్ జెనెటిక్ సంస్థ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో విశ్వవిదాలయం ఉన్నతాధికారులు డాక్టర్ అనిత,డాక్టర్ జమునారాణి, ఎన్‌బీపీజీఆర్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ వి సలియా చలం, డాక్టర్ అనిత కోడూరు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

పంజగుట్ట: జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. బీసీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యే అవకాశం చాలామటుకు కోల్పోతున్నారని, రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కనీసం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులుగా అయినా అవుతారని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీల వెనకబాటు తనానికి గత పాలకుల విధానాలే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమన్నారు. జాతీయ బీసీ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా భయ్యా వెంకటనర్సింహారాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎలిగేటి కృష్ణవేణిలను ఎంపికచేసి నియామక పత్రం అందజేశారు. త్వరలో జిల్లా, గ్రామ స్థాయి కమిటీలు వేస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినుగొండ సంధ్య, డాక్టర్ రమేష్ కల్లూరి, చలపతిరాజు, రామరాజు పాల్గొన్నారు.

చరణ్‌సింగ్‌కు నివాళి

లిబర్టీ: దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చౌదరి చరణ్‌సింగ్ జీవితాంతం పని చేశారని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వర అన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా.. ప్రధాన మంత్రిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయని స్పష్టం చేశారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ వర్ధంతి పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాన మంత్రిగా అనేక సంస్కరణలు తీసుకువచ్చి సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేశారని ఆయన గుర్తు చేశారు. చంద్రసింగ్ ప్రధాన మంత్రిగా వ్యవసాయ రంగానికి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని రాజేశ్వరరావు అన్నారు. నీతి నిజాయితీ కలిగిన నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని అన్నారు.

1న నృత్య సంగీతంపై ప్రసంగం

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల ప్రసంగ పరంపరలో భాగంగా నృత్య సంగీతంపై జూన్ 1న శ్రీ త్యాగరాయ గానసభలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్ , సమన్వయ కర్త నిష్ఠల సుధామాల తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నృత్యగురువులు ఇందిరాహేమ, వి.వాణి రమణ, శ్రీలత నారపరాజు పాల్గొన్నారు.

7న ప్రైడ్‌ఆఫ్ తెలంగాణ పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శిఖరం ఆర్టథియేటర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రైడ్‌ఆఫ్ తెలంగాణ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంస్థ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ విద్యా, వైద్యం, న్యాయ, సంగీత, నృత్యం, సామాజిక సేవా రంగాల్లో రాణిస్తున్న వారు పురస్కారాలకు దరాఖస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు జూన్ 4లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94945 23562 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి: డీబీఎఫ్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభను విజయవంతం చేయాలని ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఈనెల 30న సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం స్వామి వివేకానంద నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పులికల్పన మాట్లాడుతూ మహాసభల్లో రాజ్యాంగ పరిరక్షణ , రిజర్వేషన్లు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణ ఉపాధి, కార్మికుల చట్టం తదితర అంశాల పై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి డాక్టర్ గోపీనాథ్, జస్టిస్ చంద్రకుమార్, గోపాల్‌రావు, ఆకునూరి మురళి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు శంకర్, బస్తీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ చేసిన గంటలోనే భార్యపై దాడి

ఫిలింనగర్: కలిసి ఉండాలని, గొడవలు పెట్టుకోవద్దని పోలీసులు కౌన్సెలింగ్ చేసి పంపించిన గంట సేపట్లోనే ఓ కిరాతక భర్త తన భార్య వెళ్తున్న ఆటోపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... ఫిలింనగర్‌కు చెందిన యువతి(19) జాలోత్ ఆకాష్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఒక కూతురు కూడా ఉంది. పెళ్లి జరిగిన కొద్ది రోజుల నుంచే ఆకాష్ భార్యను వేధిస్తూ వచ్చాడు. శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో రెండు రోజుల క్రితం తన భర్తపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమె భర్త ఆకాష్‌ను, అత్తమామలు హనుమంతు, విజయలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. దీంతో ఆమె తన పుట్టినిల్లైన ఇబ్రహీంపట్నంకు తల్లిదండ్రులతో కలిసి ఆటోలో వెళ్తుండగా భర్త ఆకాష్, ఆయన స్నేహితుడు మోహన్, సాయికిరణ్‌లు బైక్‌లపై ఆటోను వెంబడిస్తూ గుడిమల్కాపూర్ సమీపంలో రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఆమె తండ్రికి రాయి తగిలి గాయాలయ్యాయి. ఆటో ధ్వంసమైంది. ఈ ఘటన వెనుక తన భర్త బంధువులు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త ఆకాష్‌తో పాటు అత్తమామలు, బంధువులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.